నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 7 సెప్టెంబర్ 2024 | HYDERABAD




సూరారంలోని కట్టమైసమ్మ చెరువును శుక్రవారం సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి సందర్శించారు. వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ వెంట మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. -దుండిగల్, సెప్టెంబర్ 6

### ట్రాఫిక్.. తిప్పల్

నగరంలో శుక్రవారం పలు చోట్ల ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకవైపు వినాయక చవితి పండుగ సందర్భంగా సామగ్రి కొనుగోళ్లు..మరోవైపు వర్షాలతో రహదారులన్నీ కిటకిటలాడాయి. ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎర్రగడ్డ వద్ద ఇలా ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు తిప్పలు పడ్డారు.



# వినాయకా.. మంగళదాయకా

## నేడు వాడవాడలా కొలువుదీరనున్న గణనాథుడు

### తొమ్మిది రోజుల పాటు నగరంలో వెల్లివిరియనున్న ఆధ్యాత్మిక శోభ

### నిమజ్జనానికి 73 ప్రాంతాల్లో బేబీ పాండ్స్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్ : గణేశ్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరుపుకొనేందుకు భాగ్యనగరం సిద్ధమైంది. గల్లీగల్లీలో గణనాథుడు కొలువుదీరనున్నాడు. తొమ్మిది రోజుల పాటు వైభవంగా పూజలందుకోనున్నాడు. నేటి నుంచి ఈ నెల 17వ తేదీ వరకు జరిగే ఉత్సవాల కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మూడో రోజు నుంచి నిమజ్జన కోలాహలం మొదలు కానున్నది. కాగా, హుస్సేన్‌సాగర్, చెరువుల్లో పీవోపీ విగ్రహాలను నిమజ్జనం చేయొద్దని హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రత్యామ్నాయంగా ప్రతి ఏటా తరహాలోనే ఈ ఏడాది కూడా 30 సర్కిళ్ల పరిధిలో తాత్కాలిక కోనేరులను సిద్ధం చేసింది. ప్రస్తుతం ఉన్న 27 బేబీ పాండ్స్‌లతో పాటు అదనంగా మరో 46 ప్రాంతాల్లో తాత్కాలిక పోర్టబుల్ వాటర్ ట్యాంక్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

#### పకడ్బందీ ఏర్పాట్లు



పర్యావరణ పర్యావరణ హితమైన గణనాథుల పూజ కోసం జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా మట్టితో రూపొందించిన 3 లక్షల పదివేల విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేసింది. ఇక మండపాల నుంచి గణనాథులను నిమజ్జనానికి తీసుకువెళ్లే మార్గాల్లో ఎలాంటి అవంతరాలు లేకుండా చెట్ల కొమ్మలను తొలగించడం, రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పూడ్చివేసి సాఫీగా గణేశ్ శోభాయాత్ర జరిగేలా ఏర్పాట్లు చేసింది. గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో అన్ని వీధుల్లో వీధి దీపాలు వెలిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు శానిటేషన్ నిర్వహణపై కూడా శ్రద్ధ పెట్టాలని అధికారులకు బల్దియా కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. మరోవైపు వినాయక ఉత్సవాల నేపథ్యంలో మంచినీటి సరఫరా, సీవరేజీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జలమండలి ఎండీ అధికారులను ఆదేశించారు.

#### మండపాలకు ఉచిత విద్యుత్



గణేశ్ మండపాలకు నిరంతర విద్యుత్ సరఫరా, భద్రతాపరంగా విద్యుత్ శాఖ తీసుకున్న చర్యలపై టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ ముషారఫ్ ఫరూఖీ శుక్రవారం సమీక్షా సమావేశాన్నినిర్వహించారు. ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 11 రోజుల పాటు జరుగనున్న నేపథ్యంలో మండపాలకు నిరంతరం ఉచితంగా విద్యుత్ సరఫరా, భద్రత కోసం తమ సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని సీఎండీ తెలిపారు.

#### కట్టుదిట్టమైన భద్రత

ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి ప్రతి ఏడాది తొమ్మిది రోజుల్లో సుమారు కోటిమందికిపైగా దర్శనానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈసారి కూడా భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. గతంలో 40 సీసీ కెమెరాలు ఉండగా, ఈ ఏడాది వాటి సంఖ్యను పెంచారు. సమారు 70 సీసీ కెమెరాలతో 24/7 నిఘా పెట్టారు. భక్తులు సెన్సేషన్ థియేటర్, ఖైరతాబాద్ రైల్వే గేటు, మింట్ కాంపౌండ్ నుంచి వార్డు కార్యాలయం మీదుగా వెళ్లి దర్శనం చేసుకునే వీలు కల్పించారు. ప్రతి ఎంట్రీ వద్ద డోర్‌ఫ్రేమ్ డిటెక్టర్, ప్రతి ఒక్క భక్తుడిని మెటల్ డిటెక్టర్ ద్వారా పరీక్షించిన తర్వాతే దర్శనానికి అనుమతిస్తామని పోలీసులు తెలిపారు.

#### ట్రాఫిక్ ఆంక్షలు

ఖైరతాబాద్‌లోని బడా గణేశ్ పరిసర ప్రాంతాల్లో నేటి నుంచి ఈనెల 17 వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. బడాగణేశ్ రూట్‌లో వచ్చే ట్రాఫిక్‌ను ఖైరతాబాద్ రాజీవ్ విగ్రహం, రాజ్‌దూత్ లేన్ , మింట్ లేన్ ఎంట్రెన్స్, నెక్లెస్ రోటరీ, పోస్టాఫీసు వద్ద ఇతర రూట్లకు మళ్లించనున్నట్లు వివరించారు. బడాగణేశ్ వద్దకు ప్రతిరోజూ భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముందని, దీంతో ఖైరతాబాద్ పరిసర ప్రాంతాల్లోని జంక్షన్లు, రూట్లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని, ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని వాహనదారులకు సూచించారు.



## నేడు సప్తముఖుడి దర్శనం

ఖైరతాబాద్‌లో కొలువుదీరిన శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి నేటి నుంచి నవరాత్రుళ్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 70 ఏండ్ల ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రస్థానంలో తొలిసారి 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పైన మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. స్వామి వారికి రెండు వైపుల అయోధ్య శ్రీబలరాముడు, రాహు, కేతులతో పాటు శ్రీ లక్ష్మీ శ్రీనివాసుడు, పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను భక్తులకు కనువిందు చేయనున్నాయి. నవరాత్రోత్సవాలకు ఉత్సవ కమిటీతో పాటు పోలీసు శాఖ, జీహెచ్ఎంసీ సకల ఏర్పాట్లు కల్పించాయి.

### తొలి పూజకు సీఎం

నేడు వినాయకచవితి సందర్భంగా స్వామి వారి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన పూజలు ఉదయం 8గంటల నుంచే ప్రారంభం కానున్నాయి. ఖైరతాబాద్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి 75 అడుగుల కండువ, జంధ్యం, గరికమాలను సమర్పించనున్నారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో అలంకరిస్తారు. కాగా, ఖైరతాబాద్ మహాగణపతికి ప్రతి ఏడాది దశాబ్దాలుగా గవర్నర్ తొలిపూజ నిర్వహించే ఆనవాయితీ కొనసాగుతున్నది. ఈ ఏడాది మొదటి సారి సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి తొలిపూజకు హాజరుకానున్నారు. సాయంత్రం 3గంటల ప్రాంతంలో తెలంగాణ గవర్నర్ హాజరవుతారని ఉత్సవ కమిటీ తెలిపింది.



వినాయక చవితి నేపథ్యంలో సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న మోండా మార్కెట్

# రైతుల ఉసురుతీస్తున్న కాంగ్రెస్ సర్కార్

## రుణమాఫీ చెయ్యదు.. రైతు భరోసా ఇవ్వదు

### సర్కారు తీరుతో కలతచెందుతున్న అన్నదాతలు

### రుణమాఫీ అందని చిట్టాపూర్ రైతు.. మేడ్చల్‌లో ఆత్మహత్య

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రులు

మేడ్చల్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురుతీస్తున్నది. అటు రుణమాఫీ చేయకుండా..ఇటు రైతు భరోసా ఇవ్వకుండా అన్నదాతల ఆత్మహత్యలకు సర్కారే కారణమవుతున్నదని రైతులు ఆరోపిస్తున్నారు. సిద్దిపేట జిల్లా చిట్టాపూర్‌కు చెందిన రైతు సోలిపేట సురేందర్‌రెడ్డి(55) మేడ్చల్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయం సమీపంలో ఆత్మహత్య చేసుకోవడం కలిచివేసింది. రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న సురేందర్‌రెడ్డి తీసుకున్న లక్షా 92 వేల పంట రుణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయకపోవడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు రైతులు పేర్కొంటున్నారు. అర్హులైన వారికీ రుణమాఫీ చేయకుండా ఇంకెంతమంది అన్నదాతల ఉసురుతీస్తారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రుణమాఫీపై ఇప్పుడు ఆంక్షలు ఎందుకు పెడుతున్నదని మండిపడుతున్నారు. రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్యకు



సురేందర్‌రెడ్డి (ఫైల్)

కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపిస్తున్నారు. కాగా, మేడ్చల్ జిల్లాలో 30 వేల పైచిలుకు రైతులు పంట రుణాలు తీసుకున్నారని, అయితే కేవలం 3,442 మందికే రుణమాఫీ చేశారని అన్నదాతలు అన్నారు. రుణమాఫీ అందని వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదులు చేసినా..లభం లేకుండాపోయిందన్నారు.

### సురేందర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రులు

మేడ్చల్‌లో ఆత్మహత్య చేసుకున్న రైతు సురేందర్‌రెడ్డి కుటుంబసభ్యులను మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరామర్శించారు. సురేందర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించి.. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. రుణమాఫీ కాలేదని రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమంటూ.. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు.





### • విద్యార్థులకు బీఆర్ఎస్ సంఘీభావం

గౌలిదొడ్డి గురుకుల విద్యాలయాలను శుక్రవారం బీఎస్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గువ్వల బాలరాజు, బాల్క సుమన్, క్రాంతి, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు సందర్శించారు. విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

# • విస్కీతో ఐస్‌క్రీమ్

## మద్యంతో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌ల విక్రయం

### యువతను ఆకర్షించేందుకు ఫేస్‌బుక్ ద్వారా ప్రచారం

### జూబ్లీహిల్స్‌లోని పార్లర్లపై ఆబ్కారీ దాడులు

### నిందితుల అరెస్టు.. 11.5 కిలోల సరుకు స్వాధీనం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): మొన్నటి వరకు గంజాయితో మత్తు చాక్లెట్లు తయారు చేశారు.. లిక్కర్‌తో మద్యం చాక్లెట్లూ రూపొందించారు.. ఇప్పుడు ఏకంగా విస్కీతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేసి.. అమ్ముతున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఆబ్కారీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషీ, ఈఎస్ నంద్యాల అంజిరెడ్డి, ఎస్టీఎఫ్ ఈఎస్ ప్రదీప్‌రావు వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన శరత్‌చంద్రారెడ్డి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 1, 5లో హరికేఫ్ ఐస్‌క్రీమ్ పార్లర్‌ను నిర్వహిస్తున్నాడు. యువతను ఆకర్షించి.. అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించే దిశగా నిబంధనలకు విరుద్ధంగా మద్యంతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేసి.. విక్రయిస్తున్నాడు. దయాకర్‌రెడ్డి, శోభన్ అనే ఇద్దరు వ్యక్తులు ఈ మత్తు ఐస్‌క్రీమ్‌ను తయారు చేస్తున్నట్లు ఆబ్కారీ అధికారులు గుర్తించారు. ఫేస్‌బుక్ ద్వారా ప్రకటనలు చేస్తూ యువతను ఆకర్శిస్తున్నట్లు విచారణలో తేలింది. సమాచారం అందుకున్న ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జూబ్లీహిల్స్ రోడ్ నం.1, 5లోని ఐస్‌క్రీమ్ పార్లర్లపై దాడులు జరిపి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 11.5 కిలోల విస్కీ ఐస్‌క్రీమ్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషీ, ఈఎస్‌లు అంజిరెడ్డి, ప్రదీప్‌రావు



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

### అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు

# సాధ్యం కాదు

### కులవృత్తులతోనే ఉపాధి

### రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : 'అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కాదు. కులవృత్తులే కీలకం. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కులవృత్తులు బతకాలి.. అప్పుడే అందరికీ ఉపాధి దొరుకుతుంది.' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 'మట్టి గణపతి-మహాగణపతి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మట్టి విగ్రహాలు వినియోగించడం వల్ల కులవృత్తులు బాగుపడుతాయని చెప్పారు. అనంతరం 2వేల మట్టి విగ్రహాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరివన్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## లంచం అడిగితే ఫిర్యాదు చేయండి

### డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో అధికారులు ఎవరైనా పనికి లంచం అడిగితే తమ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చని డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. అవినీతి ఫిర్యాదులు స్వీకరించేందుకు సీఎండీ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. విద్యుత్ సంస్థలో సిబ్బంది, అధికారులు ఏదైనా పనికి లంచం అడిగితే 040-2345 4884కు, మొబైల్ నంబర్ 7680901912కు కాల్ చేసి..ఫిర్యాదు చేయవచ్చన్నారు.

# అల్పపీడనం.. వర్షం



సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రుతుపవనాలకు తోడు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గ్రేటర్‌లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి 8గంటల వరకు గచ్చిబౌలిలో అత్యధికంగా 4.30, బీహెచ్ఈఎల్‌లో 3.90 , చందానగర్, ఫిల్మ్‌నగర్, షేక్‌పేటలో 3.65, హెచ్‌సీయూ, ఆసిఫ్‌నగర్, విజయనగర్ కాలనీ, నాంపల్లి ప్రాంతాల్లో 3.25, పటాన్‌చెరు, చార్మినార్ సర్దార్ మహల్, హయత్‌నగర్‌లో 3.0, లింగంపల్లి, ఆర్‌సీపురం, ఖాజాగూడ, కార్వాన్ ప్రాంతాల్లో 2.93, పాతబస్తీలోని చందూలాల్ బారాదరి, బేగంబజార్, హస్తినాపురం ప్రాంతాల్లో 2.70 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపారు. కాగా, నగరంలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠం 30.8, కనిష్ఠం 22.9 డిగ్రీలు, గాలిలో తేమ 84శాతంగా నమోదైనట్లు అధికారులు వివరించారు.



శుక్రవారం జలమయమైన ఖైరతాబాద్ ప్రధాన రహదారి